
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 సిద్దిపేట

ఆదివారం 6 ఏప్రిల్ 2025



విద్యుత్ వెలుగుల్లో దోబిగల్లీ రామాలయ భవనం



సిద్దిపేట దోబిగల్లీ రామాలయం వద్ద ఏర్పాటు చేసిన షామియానా.. అలంకరిస్తున్న మండపం

శ్రీసీతారాముల కల్యాణం చూతము రారండి

ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబు

7

శ్రీరామ దూతాయ నమ:

- నేటి నుంచి హనుమాన్ మండల దీక్షలు

7



సంగారెడ్డిలోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నిర్మలా జగ్గారెడ్డి

బాబు జగ్జీవన్‌రామ్ జయంతిలో నిర్మలా జగ్గారెడ్డి

సమానత్వ సాధన కోసం బాబు జగ్జీవన్‌రామ్ చేసిన సేవలు మరువలేనివి

టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. సంగారెడ్డిలోని కల్వకుంట రోడ్డులో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జయంతి వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి, కల్వకుంట రోడ్డులో ఏర్పాటు చేసిన చిత్రపటానికి మంత్రి దామోదర్ రాజనర్సింహతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ దివంగత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ సమానత్వ సాధన, సమన్యాయం కోసం తీసుకొచ్చిన సంస్కరణలతో అన్నివర్గాల పేదలకు ప్రయోజనం చేకూరిందని వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, మాజీ చైర్మన్ తోపాజీ అనంతకిషన్, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు కూన సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

ఎల్‌ఆర్‌ఎస్ చెల్లింపులు 12.78 శాతమే

దరఖాస్తుదారుల్లో స్పందన కరువు

- ఫీజు రాయితీ ఇచ్చినా వెనుకడుగు
- నెలాఖరు వరకు గడువు పొడిగించిన ప్రభుత్వం
- దరఖాస్తుదారులకు ఫోన్ చేస్తున్న సిబ్బంది
- సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు



జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ వివరాలు

మొత్తం దరఖాస్తులు	1,00,929
అనుమతిచ్చినవి	86,608
ఐదు మున్సిపాలిటీల్లో	46,942
సుడా పరిధిలో	20,781
గ్రామ పంచాయతీల్లో	18,885
రుసుం చెల్లించింది	11,070
ప్రొసీడింగ్స్ వచ్చినవి	1,817

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : అనుమతి లేని లేఅవుట్లు, అనధికారిక ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి ఉపశమనం కలిగించేలా 2020లో గత ప్రభుత్వం ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్)ను అమలులోకి తీసుకువచ్చింది. ఆ దరఖాస్తులను పరిశీలించి ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించేందుకు ప్రస్తుత ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించేందుకు 25 శాతం రాయితీని ప్రకటించింది. ముందుగా మార్చి నెలాఖరు చివరి గడువుగా నిర్ణయించగా, స్పందన అంతంత మాత్రంగానే రావడంతో మరోసారి ఈ నెలాఖరు వరకు పొడగించింది. అయితే, అధికారుల పరిశీలన అనంతరం గ్రీన్‌సిగ్నల్ వచ్చిన దరఖాస్తుల్లో కేవలం 12.78 శాతమే రాయితీని సద్వినియోగం చేసుకున్నారు. క్రమబద్ధీకరణ గడువును పెంచడంతో నెలాఖరు వరకైనా దరఖాస్తుదారులకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటారో చూడాలి.

14,321 దరఖాస్తులు తిరస్కరణ

సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలు, సుడా అథారిటీ పేరిట మూడు కేటగిరిలుగా దరఖాస్తులను అధికారులు విభజించారు. వీటిలో జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలు సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల, 23 మండలాలకు సంబంధించి, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కింద సిద్దిపేట, సిద్దిపేట అర్బన్, చిన్నకోడూర్, నంగునూర్, కొండపాక నుంచి ఎల్‌ఆర్‌ఎస్ క్రమబద్ధీకరణ కోసం అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా 1,00,929 దరఖాస్తులు రాగా, వాటిని పరిశీలించిన అధికారులు 86,608 దరఖాస్తులకు ఫీజు చెల్లించేందుకు అనుమతినిచ్చారు. 14,321 దరఖాస్తుల్లో క్రమబద్ధీకరణకు సంబంధించి సరైన పత్రాలు లేకపోవడంతో తిరస్కరించారు.

ఫోన్ కొట్టు.. ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు కట్టు

ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు కట్టేందుకు ముందుగా మార్చి 31 వరకు తుది గడువును ప్రభుత్వం విధించింది. పలువురు దరఖాస్తుదారుల కోరిక మేరకు ప్రభుత్వం రాయితీని కొనసాగిస్తూ ఏప్రిల్ చివరి వరకు గడువును పెంచింది. దీంతో ఎల్‌ఆర్‌ఎస్ ఫీజును రాబట్టేందుకు అధికారుల సూచన మేరకు సిబ్బంది, దరఖాస్తుదారులకు ఫీజు చెల్లించాలంటూ కాల్ చేసి రాయితీని సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నారు. గడువు తీరేలోపు సాధ్యమైనంత మేరకు ఫీజు చెలించేలా కృషిచేస్తున్నారు.

ప్రొసీడింగ్ పత్రాలు 2 వేలలోపే

జిల్లా వ్యాప్తంగా 1,00,929 ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. వీటిలో జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో 57,995 దరఖాస్తులకు గానూ 46,942, సుడా పరిధిలో 21,523 దరఖాస్తులకు గానూ 20,781, గ్రామ పంచాయతీల్లో 21,411 దరఖాస్తులకు గానూ 18,885 దరఖాస్తులకు ఫీజు చెల్లించేందుకు అధికారులు అనుమతినిచ్చారు. పలు దరఖాస్తుల్లో భూములకు సంబంధించి పత్రాలు సరిగా లేకపోవడం, చెరువులు, నిషేధిత స్థలాలు, కుంటలు, బఫర్ జోన్ స్థలాల్లో క్రమబద్ధీకరణకు అధికారులు అనుమతించకపోవడంతో మొత్తంగా 86,608 దరఖాస్తులకు మాత్రమే ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించేలా అధికారులు నిర్ణయించారు. ఈ దరఖాస్తుల్లోనూ ఇప్పటివరకు ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించింది 11,070 మంది మాత్రమే. అంటే 12.78 శాతమే ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించారు. దీంతో ఆదాయం రూ. 25.12 ఆదాయం వచ్చింది. 11,070 మంది ఫీజులు చెల్లించినప్పటికి వీరిలో 1817 మందికి మాత్రమే ప్రొసీడింగ్ పత్రాలను అందించినట్లు తెలిసింది.




సిద్దిపేటలోని ఓ వెంచర్‌లోని ప్లాట్లు



సామూహిక భగవద్గీత పారాయణం చేస్తున్న గ్రామస్తులు(ఫైల్)

కళామతల్లి.. గొల్లపల్లి

- 60 ఏళ్లుగా సామూహిక గీతాపారాయణం
- పండుగలొస్తే యువత కోలాటం స్పెషల్
- భాగవతం ఆటలతో ప్రశంసలు



గణపతిదేవుడి వేషంలో..

పాత తరం కళలను సజీవంగా నిలిపేలా ఆ గ్రామస్థులు పాటుపడుతున్నారు. పెద్దల సహకారంతో యువత భజన, కోలాటం, పురాణగాథల ప్రదర్శనలతో ఆకట్టుకుంటున్నారు. సామూహిక గీతా పారాయణం గావిస్తూ ఆధ్యాత్మికత, సాంస్కృతిక కళావైభవాన్ని చాటుతున్నారు. ఆ గ్రామమే సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలంలోని గొల్లపల్లి.

Sunday Special

మల్లన్న ఆలయ ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీపై కేసు



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చేర్యాల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ, ఈఎస్ఐ, ఈపీఎఫ్ డబ్బులు చెల్లించకుండా రూ.28 లక్షల మేర సొంతానికి వాడుకుని టోకరా ఇచ్చిన మల్లన్న ఆలయ ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీపై ఎట్టకేలకు కేసు నమోదైంది. కొమురవెల్లి మల్లన్న ఆలయానికి మ్యాన్ పవర్ సరఫరా ఒప్పందం కుదుర్చుకున్న హైదరాబాద్ హిమాన్ష్ సీఆర్ఎం సర్వీసెస్ నిర్వాహకులు జూలై 2023 నుంచి జనవరి 2025 వరకు 30 మంది సిబ్బందికి సంబంధించిన ఈఎస్ఐ, ఈపీఎఫ్ డబ్బులు రూ.14 లక్షలు చెల్లించకపోవడంతో ఇటీవల ఆలయాధికారులతో పాటు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం విధితమే. విచారణ నిమిత్తం పోలీసులు కొద్దిరోజుల క్రితం పలు వివరాలను అందించాలని ఆలయాధికారులకు లేఖ రాశారు. అయినా అధికారులు జాప్యం వహిస్తూ వచ్చారు. ఈ విషయమై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'మల్లన్నా.. సొమ్ము రికవరీ చేసేదెవరన్నా' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన పోలీసు అధికారులు విచారణ వేగవంతం చేశారు. పోలీసులు కోరిన వివరాలను ఆలయాధికారులు అందజేశారు. ఈ విషయమై చేర్యాల సీఐ శ్రీను శనివారం మల్లన్న ఆలయాధికారులతో మాట్లాడి విచారించారు. అనంతరం సీఐ శ్రీను మాట్లాడుతూ హిమాన్ష్ సీఆర్ఎం సర్వీసెస్‌పై కేసు నమోదు చేశామని, విచారణను వేగవంతం చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అరచేతిలో ఆరోగ్యశ్రీ సమాచారం

- అందుబాటులోకి ప్రత్యేక యాప్
- ఆస్పత్రులు, స్పెషాలిటీ వివరాలు, ఆరోగ్య మిత్రల నంబర్లు

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ ఆరోగ్యశ్రీ సమాచారం అరచేతిలోనే అందుబాటులోకి తేవడానికి ఆరోగ్యశ్రీ ట్రస్టు అధికారులు ప్రత్యేక మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. జిల్లాలో, సమీపంలో ఏయే ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులో ఉన్నాయనే సమాచారాన్ని తెలుసుకునే అవకాశం కల్పించారు. మొబైల్ ఫోన్‌లోనే కాకుండా కంప్యూటర్‌లోనూ సులువుగా సమాచారాన్ని తెలుసుకునేలా యాప్‌ను రూపొందించారు.

ఆరోగ్యశ్రీ కింద 1,835 చికిత్సలు

రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్య శ్రీ సేవల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిన విషయం తెలిసిందే. అయితే ఈ పథకం కింద ఆరోగ్య శ్రీ కార్డు ఉన్న వారు 1835 చికిత్సలు చేసుకోవచ్చు. ఆరోగ్య శ్రీ కార్డు ఆమోదించే ఆస్పత్రుల్లో మాత్రమే ఉచిత వైద్య సేవలు పొందే అవకాశం ఉంటుంది. కాగా ఆరోగ్య శ్రీ యాప్‌లో ఆస్పత్రి చిరునామా, అందుబాటులో ఉన్న స్పెషాలిటీ చికిత్సలు, ఆరోగ్యమిత్రల పేర్లు, ఫోన్ నంబర్లు కూడా పొందుపర్చారు. సమయం వృథా కాకుండా సందేహాలుంటే నివృత్తికి ఆరోగ్య మిత్రల నంబర్లను సంప్రదించే వెసులుబాటు కల్పించారు.



ఐదేళ్ల వరకు 'కాక్లియర్'

వినికిడి, మాట లోపమున్న చిన్నారులకు అందించే 'కాక్లియర్ ఇంప్లాంటేషన్' శస్త్ర చికిత్సకు సంబంధించి చిన్నారుల వయస్సును మూడేళ్ల నుంచి ఐదేళ్లకు పెంచుతూ ఆరోగ్యశ్రీ ట్రస్టు నిర్ణయం తీసుకున్నది. వాస్తవానికి చిన్నారులకు పుట్టుకతో వచ్చే ఈ వైకల్య సమస్యలు మూడేళ్ల దాటినా స్పష్టత రావడం లేదు. దీంతో చాలావరకు వినికిడి పరికరాలతో నెట్టుకొస్తున్నారు. ఆరోగ్య శ్రీ పథకం కింద మూడేళ్ల వయస్సు వారికే చికిత్సకు అవకాశం ఉండడంతో చాలా మంది ప్రైవేటుకు వెళ్లాల్సి వస్తున్నది. ఈ రకంగా సుమారు రూ.8 లక్షల వరకు ఖర్చు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ట్రస్టు అధికారులు చిన్నారుల వయస్సు పరిమితిని ఐదేళ్లకు పెంచారు.

సీనియర్ సిటిజన్లకు సత్వర సేవలు

కేంద్ర ప్రభుత్వం పీఎంజేఏవై 'వయ వందన' పథకాన్ని తాజాగా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ పథకం కింద 70 ఏళ్లు దాటిన సీనియర్ సిటిజన్స్ ఏవరైనా ఆరోగ్యశ్రీ కార్డుతో సంబంధం లేకుండా వైద్య సేవలు పొందవచ్చు. ఇప్పటికే దీనికి సంబంధించిన మార్గదర్శకాలు కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేశాయి. ఈ వారంలో 'వయ వందన' పథకాన్ని తెలంగాణ రాష్ట్రంలోనూ అమలులోకి రానుండగా, ఆ పథకం సమాచారాన్ని కూడా ఆరోగ్యశ్రీ ప్రత్యేక యాప్‌లో తాజాగా పొందుపర్చారు.

మల్లన్న ఆలయ ఈవో బదిలీ?

చేర్యాల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లన్న ఆలయ ఈవో రామాంజనేయులును దేవాదాయశాఖ ఉన్నతాధికారులు అనూహ్యంగా బదిలీ చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. గతేడాది డిసెంబరు నెలాఖరులో బాలాజీ శర్మ ఉద్యోగ విరమణ చేయడంతో దేవాదాయ శాఖ కార్యాలయ సూపరింటెండెంట్ గ్రేడ్-2 అధికారి రామాంజనేయులుకు మల్లన్న ఆలయం అదనపు బాధ్యతలను అప్పగించారు. జనవరి 1న ఆయన విధుల్లో చేరారు. అయితే, మూడు నెలలపాటు కొనసాగిన మల్లన్న జాతర కొద్ది రోజుల క్రితం ముగిసిన నేపథ్యంలో పరిపాలన సౌలభ్యం దృష్ట్యా ఆయనను బదిలీ చేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. ఓ కార్యక్రమ తలెత్తిన విబేధాలతోనే బదిలీ చేస్తున్నట్లు స్థానికంగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దేవాదాయశాఖ మంత్రికి సంబంధించిన ఓ అనధికార వ్యక్తి సిఫారసు పేరిట మల్లన్న ఆలయంలో గత నెల 26న కల్చరల్ ఈవెంట్‌ను చేపట్టేందుకు అనుమతించాలని, అందుకయ్యే ఖర్చు భరించాలంటూ ఓ సంస్థ ప్రతినిధి ఆలయ వర్గాలను కోరారు. కానీ అగ్నిగుండాలు ఉండటంతో పాటు కల్చరల్ కార్యక్రమం పట్ల స్థానికంగా విమర్శలు వెల్లువెత్తగా ఉపసంహరించుకున్నారు. ఇదే విషయంలో విబేధాలు తలెత్తడంతో పాటు గతంలో చోటుచేసుకున్న పరిణామాల క్రమంలో రామాంజనేయులును బదిలీచేస్తూ మరో మహిళాధికారిని నియమించినట్లు తెలిసింది. ఈ విషయం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.




చిన్నకోడూరు కొనుగోలు కేంద్రంలో ఆరబెట్టిన పొద్దు తిరుగుడు గింజలు

పొద్దుతిరుగుడు కొనుగోళ్లకు బ్రేక్

- లక్ష్యం పూర్తయిందని నిలిపేసిన వైనం
- చిన్నకోడూరు కొనుగోలు కేంద్రంలో పది రోజులుగా రైతుల పడిగాపులు

8




ఆత్మీయ సమ్మేళనంలో అభివాదం చేస్తున్న ఉద్యోగులు

'భూభారతి'తో రెవెన్యూ వ్యవస్థ పునర్నిర్మాణం

తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి

7



అదృశ్యమైన చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగింత


చిన్నారిని తండ్రికి అప్పగిస్తున్న పోలీసులు

గుమ్మడిదల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : అదృశ్యమై ఆచూకీ లభించిన చిన్నారిని పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం శనివారం ఉదయం 10.30 గంటలకు దోమడుగు గ్రామానికి చెందిన ఆకుల నాగరాజు తన ఆరేళ్ల కూతురు ఆకుల కనబడడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గ్రామ ప్రభుత్వ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నదని, శనివారం సెలవు దినం అని తెలియక స్కూల్‌కు పంపించామని తెలిపారు. తరువాత పాఠశాల లేదని తెలుసుకుని వెంటనే స్కూల్ వద్దకు వెళ్లి చూడగా కనిపించలేదని, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి నలుగురు సిబ్బందితో సుమారు ఒక గంట పాటు దోమడుగు గ్రామంలో వెతకగా.. బాలిక ఒక దగ్గర ఆడుకుంటూ కనిపించింది. పోలీసులు ఆ చిన్నారని తల్లిదండ్రులకు అప్పగించగా వారు కృతజ్ఞతలు తెలిపారు.

550 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



పుల్‌కల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని అక్రమంగా లారీల్లో సరిహద్దులు దాటిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారి తాడ్దానిపల్లి టోల్ ప్లాజా వద్ద శుక్రవారం రాత్రి పుల్కల్ ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ సిబ్బందితో వాహనాలను తనిఖీ చేస్తున్నారు. రేషన్ బియ్యం తరలిస్తున్నారన్న సమాచారం మేరకు కేఏ38ఏ 4584, జీజే08వై 8776 నంబరు గల లారీలను తనిఖీ చేయగా ఒక్కో లారీలో 275 క్వింటాళ్ల చొప్పున మొత్తం 550 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. వీటి విలువ దాదాపు రూ.40 లక్షల వరకు ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి మహారాష్ట్రలోని నాందేడ్ మీదుగా గుజరాత్ రాష్ట్రానికి తరలిస్తున్నట్లుగా తెలిసింది. పట్టుబడిన లారీలను పుల్కల్ పోలీస్ స్టేషన్‌కు తరలించి శనివారం జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని రేషన్ బియ్యమేనని ధ్రువీకరించారు. ఈ మేరకు లారీలు, డ్రైవర్లపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై అత్యాచారయత్నం.. నిందితుడి అరెస్టు

జోగిపేట రూరల్, మార్చి 5(ఆంధ్రజోతి): గిరిజన మహిళపై అత్యాచారయత్నం, కత్తితో దాడిచేసిన నిందితుడిని పోలిసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను జోగిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సర్కిల్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ అనిల్‌కుమార్ వెల్లడించారు. పుల్కల్ మండలం గొంగులూరు గ్రామానికి చెందిన అనిత అనే మహిళ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నది. పుల్కల్ మండలం మిన్పూర్ గ్రామానికి చెందిన బోయిని అంజనేయులు(26) సెల్‌ఫోన్లను దొంగలిస్తూ.. వాటి నుంచి మహిళలకు కాల్ చేసి రప్పించి డబ్బు ఆశ చూపించి శారీరకంగా లొంగదిసుకుంటున్నాడు. ఇదే క్రమంలో ఈ నెల 2న అనితకు అంజనేయులు ఫోన్ చేసి కూలి పని ఇప్పిస్తానంటూ చౌటాకూర్ మండలం బోమ్మారెడ్డిగూడెం గ్రామ శివారులోకి తిసుకెళ్లి అత్యాచారయత్నం చేయగా, బాధిత మహిళ ప్రతిఘటించింది. దీంతో అతడు తన వెంట తెచ్చుకున్న కత్తితో ఆమెపై దాడిచేసి పరారయ్యాడు. బాధిత మహిళ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేపట్టిన వారు బాధితురాలి ఫోన్‌కాల్ ఆధారంగా నిందితుడిని అదుపులోకి తిసుకుని రిమాండ్‌కు తరలించినట్టు సీఐ అనిల్‌కుమార్ తెలిపారు.





గల్లంతైన యువకుల మృతదేహాలు లభ్యం

● గ్రామంలో విషాద ఛాయలు.. మిన్నంటిన రోదనలు



మృతులు ప్రేమ్‌కుమార్, నవీన్‌కుమార్ (ఫైల్)

హత్నూర, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): హత్నూర మండల పరిధిలోని బోర్పట్ల గ్రామ శివారులోని భీముని చెరువులో గల్లంతైన యువకుల మృదేహాలు శనివారం లభ్యమయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. కొండాపూర్ మండలం మల్కాపూర్ గ్రామ పంచాయతీ పరిధి మధిర గ్రామమైన కుతుబ్‌షాహీపేటకు చెందిన ప్రేమ్‌కుమార్(41) అత్తవారి గ్రామమైన బోర్పట్లలో మల్లికార్జున స్వామి జాతరకు భార్య పిల్లలతో వచ్చాడు. శుక్రవారం మధ్యాహ్నం గ్రామ సమీపంలోని భీముని చెరువులోకి స్నానం చేసేందుకు వెళ్లి గల్లంతు కాగా, అతని కాపాడేందుకు చెరువులోకి దిగిన బోర్పట్ల గ్రామానికి చెందిన డప్పు నవీన్‌కుమార్(25) కూడా గల్లంతైన విషయం తెలిసిందే. శుక్రవారం మధ్యాహ్నం నుంచి గాలింపు చర్యలు చేపట్టిన మత్స్యకారులు ఎట్టకేలకు శనివారం ఉదయం వారి మృతదేహాలను వెలికి తీశారు. మృతుడు నవీన్‌కుమార్‌కు భార్య, తల్లిదండ్రులు ఉండగా, ప్రేమ్‌కుమార్‌కు భార్య, ఓ కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుల కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ సుభాష్ తెలిపారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకోగా, మృతుల కుటుంబీకులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

చెరువులో జారిపడి మహిళ మృతి

రామాయంపేట, ఏప్రిల్5(ఆంధ్రజ్యోతి) : రామాయంపేట మున్సిపల్ పరిధిలోని గోల్పర్తిలో మహిళ చెరువులో జారిపడి మృతిచెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చిన్నపల్లి లక్ష్మి(55) శనివారం మధ్యాహ్నం పొండ చెరువు వద్దకు వెళ్లింది. ఏం జరిగిందో తెలియదు కానీ.. సాయంత్రం చెరువులో శవం తేలియాడుతూ కనిపించింది. అటుగా వెళ్తున్నవారు గమనించి అప్పటికే కనిపించకుండా పోయిన లక్ష్మి విషయమై భర్త నారాయణకు తెలిపారు. ఘటనా స్థలానికి చెరుకున్న భర్త ఆమెను గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ బాలరాజ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చేపల వేటకు వెళ్లి వలలో చిక్కుకొని..


అంజనేయులు మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

జిన్నారం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): చెరువులో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. జిన్నారం మండలం కొడకంచి గ్రామ పరిధి పుట్టగూడ కు చెందిన కంచన్నపల్లి ఆంజనేయులు (49) శనివారం తెల్లవారు జామున గ్రామ నల్ల చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు వల కాళ్లకు చిక్కుకోవడంతో నీటిలో మునిగి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. ఘటన స్థలాన్ని జిన్నారం ఎస్ఐ నాగలక్ష్మి సందర్శించి, మృతుడి కుమారుడు జితేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో యువకుడు..



కొల్చారం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి చెందిన సంఘటన కొల్చారం మండలం వరిగుంతం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన బాలయ్యల పోచయ్య (38) ఇంటి నిర్మాణంలో భాగంగా మోటారును మరమ్మతుల కోసం వెలికితీయడంతో ఆకస్మాత్తుగా కరెంట్ షాక్ గురై మృతి చెందాడు. భార్య చంద్రకళ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడు పోచయ్యకు ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతుని కుటుంబాన్ని మాజీ జడ్పీటీసీ మేఘమాల సంతోష్ పరామర్శించి కుటుంబాన్ని ఓదార్చారు.

జీవితంపై విరక్తితో వృద్ధుడి ఆత్మహత్య

కోహెడ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బస్వాపూర్ గ్రామంలో వేళ్ల ఎల్లయ్య (82) శనివారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ అభిలాష్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఎల్లయ్యకు ఇద్దరు కూతుర్లు, ఇద్దరు కుమారులు కాగా, అందరికీ వివాహమైంది. వారు వివిధ ప్రాంతాల్లో జీవన కొనసాగిస్తున్నారు. సంవత్సరం క్రితం ఎల్లయ్య భార్య మృతి చెందగా ఒంటరిగా ఉంటున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి..

తొగుట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై వ్యక్తి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రమైన తొగుటలో శనివారం మధ్యాహ్నం జరిగింది. తొగుట పోలీసులు, కుటుంబీకుల కథనం ప్రకారం.... గ్రామానికి చెందిన మేకల స్వామి (39)కి భార్య లక్ష్మి, ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. స్వామి వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈక్రమంలో గత కొద్ది రోజుల నుంచి అతడు మద్యానికి బానిసగా మారాడు. ఈ విషయమై కుటుంబంలో తరచూ గొడవలు జరిగేవి. ఎన్నిసార్లు చెప్పిన స్వామి మద్యాన్ని మానడంలేదు. రోజు మాదిరిగా స్వామి శనివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. దాంతో అతడి భార్య అతడి ప్రవర్తన నచ్చక పక్కింటికి వెళ్లడంతో మద్యం మత్తులో ఇంటిలోని రేకులపైపుకు డిష్ వైరుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోద్ చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తొగుట ఎస్ఐ రవికాంత్‌రావు తెలిపారు.

నగల దుకాణంలో చోరీ

● బంగారం, వెండి ఆభరణాల అపహరణ

నిజాంపేట, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): నగల దుకాణంలో చోరీ జరిగిన సంఘటన నిజాంపేట మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని వెంకటాపూర్(కే)గ్రామనికి చెందిన బొర్రోజు బాలచంద్రం(శేఖర్) నగల దుకాణంకు శుక్రవారం సాయంత్రం తాళం వేసి సిద్దిపేటలో తన ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం దుకాణం ముందు పనిచేసే మహిళ వచ్చి చూసేసరికి తాళం పగలగొట్టి ఉండడాన్ని యజమానికి సమాచారం అందించారు. అతడు వచ్చి చూసేసరికి టేబుల్ డ్రా ఉన్న 76 తులాల వెండి, నాలుగు గ్రాముల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. దీంతో బాధితుడు నిజాంపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా రామాయంపేట సీఐ వెంకటరాజా గౌడ్ ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.









శ్రీ సీతారాముల కల్యాణం చూతము రారండి


మార్కెట్ చౌరస్తాలోని వీరాంజనేయ స్వామి ఆలయం



శ్రీరామదూతాయ నమః

నేటి నుంచి హనుమాన్ మండల దీక్షలు- సిద్దిపేట నుంచే దీక్షలకు శ్రీకారం

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ మండల దీక్షలకు భక్తులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే వసంత పంచమి నుంచి 108 రోజుల హనుమాన్ దీక్షను తీసుకోగా, నేటి శ్రీరామనవమి మండల దీక్షలు ప్రారంభం కానున్నాయి. 45 రోజుల పాటు సిద్దిపేట మాలధారణ భక్తులతో అధ్యాత్మిక శోభ సంతరించుకుంటుంది. 1983లో అఖిల భారత హనుమాన్ దీక్ష పీఠాధిపతి, హనుమాన్ దీక్ష మాల రూపకర్త దుర్గాప్రసాద్ స్వామిజీ నేతృత్వంలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో హనుమాన్ మాలధారణ ప్రారంభమైంది. అదే ఏడాది తెలంగాణ నుంచి సిద్దిపేటకు చెందిన ఆరుగురు హనుమాన్ మాలను స్వీకరించారు. పట్టణంలోని మార్కెట్‌చౌరస్తాలో ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయంలో అప్పుడు పూజారిగా ఉన్న బ్రహ్మశ్రీ అర్వపల్లి రఘురామశర్మ.. పజ్జూరి హరి, గుండ్ల జనార్దన్, తోడుపునూరి శ్రీనివాస్, కోర్తివాడ శ్రీనివాస్, దొంతుల శ్రీనివాస్, పెట్రోల్ బంక్ బాలయ్య అనే అరుగురికి హనుమాన్ దీక్షను ఇచ్చారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు దినదిన ప్రవర్ధమానమై వేల సంఖ్యలో భక్తులు దీక్ష స్వీకరిస్తున్నారు. ఇక్కడి రామరాజురావిచెట్టు హనుమాన్ దేవాలయంలో ఎక్కడా లేని విధంగా హనుమాన్ తెప్పోత్సవం నిర్వహిస్తారు.

నిత్యాన్నదానాలకు నిలయం

హనుమాన్ మాలధారణ చేసిన భక్తుల కోసం సిద్దిపేట పట్టణంలో ఎప్పుడూ ఎవరో ఒకరు బిక్ష ఏర్పాటు చేస్తుంటారు. మాలధారులకు నిత్యం అన్నప్రసాదం అందించాలనే ఉద్దేశంతో పట్టణంలోని పారుపల్లి వీధిలోని శ్రీరామరాజు రావిచెట్టు హనుమాన్ దేవాలయంలో 2006 నుంచి అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. 2010లో ఈ ఆలయానికి సంబంధించిన ఒక ట్రస్ట్ ఏర్పాటు చేశారు. 2011లో ట్రస్ట్ కోసం ప్రత్యేక భవనం నిర్మాణం చేపట్టారు. శ్రీ రామనవమి నుంచి మొదలుకొని హనుమాన్ జయంతి వరకు దాతల సహకారంతో స్వాములకు ఆనాటి నుంచి అన్నప్రసాదం అందిస్తున్నారు. గణేష్‌నగర్‌లోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో కూడా భక్తులకు భిక్ష ఏర్పాటు ఉంటుంది. ఇక్కడ అక్షయ తృతీయ నుంచి మొదలుకొని హనుమాన్ జయంతి వరకు 23 రోజులపాటు హనుమాన్ స్వాములకు భిక్ష ఏర్పాటు చేస్తున్నారు. 2008లో భవనం లేకపోతే పందిర్లు వేసి భక్తులకు 11 రోజుల భిక్ష ఏర్పాటు చేశారు. అనంతరం 30 మందితో ట్రస్ట్‌గా ఏర్పడి 2016లో చిన్నజీయర్ స్వామిజీ చేతుల మీదుగా నూతన భవనం అన్నప్రసాదం కోసం ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి అక్షయ తృతీయ రోజున అన్నదానం ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతమున్న 120 మంది ట్రస్ట్ సభ్యుల సహకారం, దాతల ప్రోత్సాహంతో భిక్షను స్వాములకు అందిస్తున్నారు. ఈ రెండు ఆలయాలే కాకుండా పట్టణంలో పలు ఆలయాల్లో దాతల సహకారంతో భిక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు.

ఎక్కడా లేని విధంగా తెప్పోత్సవం



500 ఏళ్ల నాటి రామరాజురావిచెట్టు హనుమాన్ దేవాలయంలో మాలధారణ, మాల విరమణ, నిత్యాన్నదానం కార్యక్రమాలు జరుగుతాయి. ఎక్కడ లేని విధంగా ఈ ఆలయ ఆధ్వర్యంలో హనుమాన్ తెప్పోత్సవం నిర్వహిస్తాం. నిత్యం రామనామ కీర్తనలు, భజన కార్యక్రమాలు ఉంటాయి.

- వైద్యాకృష్ణమాచార్యులు, రావిచెట్టు హనుమాన్ దేవాలయ అర్చకులు

శ్రీరామనవమి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబు

మెదక్ అర్బన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు, ఆశ్రిత జనబాంధవుడు శ్రీరామచంద్రుని కల్యాణం కోసం ఉమ్మడి జిల్లాలోని సర్వంగాసుందరంగా సిద్ధమయ్యాయి. మెదక్‌లోని శ్రీ కోదండ రామాలయంలో స్వామివారి 49వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీ సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహిస్తారు. ఇందుకోసం ఆలయాన్ని విద్యుత్ దీపాల వెలుగులతో, చలువ పండిళ్లతో, ప్రత్యేకంగా తెప్పించిన పూలతో ముస్తాబు చేశారు. స్వామివారికి ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావ ముత్యాల తలంబ్రాలు, పుస్తె మెట్టెలు, పట్టు వస్త్రాలను సమర్పించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు బండ నరేందర్ తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకులు భాష్యం మధుసూదన్ చార్యుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం జరగనుంది.


మెదక్ శ్రీకోదండ రామాలయంలో కల్యాణానికి ముస్తాబైన స్వామివారు

దీపధూపాలకు నోచుకోని కోదండ రాముడు



శివ్వంపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన శివ్వంపేటలోని కాకతీయుల కాలం నాటి పురాతన కోదండ రామస్వామి ఆలయాన్ని ఎవరూ పట్టించుకోకపోవడంతో దీపధూప నైవేద్యాలకు నోచుకోవడం లేదు. ప్రహరీ గోడ కూలి, ధ్వజస్తంభం విరిగి ఆలయం శిథిలావస్థకు చేరుతోంది. గతంలో ఈ ఆలయంలో కోదండరామస్వామి జాతర రథోత్సవం వారం రోజులపాటు కన్నుల పండుగగా జరిగేది. అయితే, ఈ ఏడాది స్థానిక పురోహితుడు వామనశర్మ ఆధ్వర్యంలో శ్రీరామనవమి నుంచి పది రోజులపాటు స్థానికులు ఇచ్చిన విరాళాలలోజాతర నిర్వహించాలని నిర్ణయించారు. అయితే, పురాతన ఆలయాన్ని దీపధూప నైవేద్యం పథకం కింద ఎంపిక చేయాలని స్థానికులు కోరుతున్నారు.

బావిలో ప్రత్యక్షం.. ఊరిలో కొలువు..



కుకునూరుపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): నాలుగు వందల ఏళ్ల క్రితం వ్యవసాయ బావి పూడిక తీస్తుండగా, శ్రీ సీతారామచంద్ర స్వామి విగ్రహాలతోపాటు లక్ష్మణుడు, హన్మంతుడి రాతి విగ్రహాలు కనిపించాయి. దీంతో కొడకండ్ల, కుకునూరుపల్లి గ్రామ ప్రజలు, రైతులు విగ్రహాలను తీసుకువెళ్లి ఎవరికి వారు తమ గ్రామంలో ప్రతిష్ఠించి ఆలయం నిర్మిస్తామని పట్టుపట్టారు. కొడకండ్ల గ్రామ పరిసరాల్లో విగ్రహాలు లభ్యం కావడంతో అవి తమ గ్రామంలోనే ఉండాలని విగ్రహాలను ఎడ్ల బండి పెట్టుకొని తీసుకువెళ్లడానికి ప్రయత్నించగా అక్కడి నుంచి ఎడ్ల బండ్లు ఎంతటికీ కదలలేదు. తర్వాత ఎడ్లు వాటంతట అవే పరిగెత్తుకుంటూ వచ్చి కుకునూరుపల్లి గ్రామం మధ్యలో ఆగాయి. దీంతో రెండు గ్రామాల ప్రజలు ఏకతాటిపైకి వచ్చి కుకునూరుపల్లిలో ఎడ్లబండి ఆగిన ప్రాంతంలో శ్రీ సీతారామ స్వామి ఆలయాన్ని నిర్మించి దేవతామూర్తులను పూజిస్తున్నారు. ఇంతటి చరిత్ర ఉన్న కుకునూరుపల్లి రామాలయంలో శ్రీ సీతారాముల కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కల్యాణ మహోత్సవంతో పాటు మూడు రోజుల తర్వాత గరుడ సేవ రథోత్సవం నిర్వహించనున్నారు.



శ్రీరామ నవమికి పటిష్ట బందోబస్తు

సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలో జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్టు సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. శ్రీ రామనవమి సందర్భంగా జహీరాబాద్, సదాశివపేట, సంగారెడ్డి పట్టణాల్లో ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించారు.

'భూభారతి'తో రెవెన్యూ వ్యవస్థ పునర్నిర్మాణం

రైతులకు మేలు.. ఉద్యోగులకు భరోసా

ప్రభుత్వ సంకల్పాన్ని నెరవేర్చే బాధ్యత జీపీవోలదే

తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి

కొండపాక, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టంతో రైతులకు మేలు, రెవెన్యూ ఉద్యోగులకు భరోసా ఉంటుందని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా కొండపాక మండలం నాగులబండ వద్ద గల హరిత హోటల్‌లో ఉమ్మడి మెదక్ జిల్లా రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనాన్ని శనివారం తహసీల్దార్ సరిత అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో లచ్చిరెడ్డి మాట్లాడుతూ ఈ చట్టంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు రెవెన్యూ వ్యవస్థ పునర్నిర్మాణం అవుతుందన్నారు. రైతులకు మెరుగైన సేవలు అందడంతో పాటు, ప్రభుత్వ ఉద్యోగులకు పదోన్నతులు వస్తాయన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఉద్యోగ భద్రతకు సమీప భవిష్యత్తులోనే ఓ భరోసా దొరుకుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ఆప్షన్ల ద్వారా రెవెన్యూ శాఖలోకి వస్తున్న జీపీవో (గ్రామ పరిపాలన అధికారి)లు సర్వీసుపరమైన అభద్రతకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం జీపీవో పోస్ట్ కొత్తగా క్రియేట్ చేసిందని, అన్ని ప్రభుత్వ ఉద్యోగులకు వచ్చినట్లుగానే పదోన్నతులు వస్తాయన్నారు. ఆప్షన్ల ద్వారా నియామకం అవుతున్న జీపీవోలందరికీ కామన్ సర్వీస్ ఉంటుందన్నారు. భూ భారతి చట్టం ద్వారా అధికారాల వికేంద్రీకరణ జరగడంతో భూ సమస్యలు సత్వరం పరిష్కారం అవుతాయన్నారు. భూ సమస్యలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు రెవెన్యూ ఉద్యోగులు పునరంకితం కావాలన్నారు. గ్రామ స్థాయిలోనే రెవెన్యూ సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం 10,954 మంది గ్రామ పాలన అధికారులను వ్యక్తిగత ఆప్షన్ల ద్వారా నియామకం చేస్తుందన్నారు. అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందించేందుకు రెవెన్యూ ఉద్యోగులు అత్యంత బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. ప్రభుత్వ సహకారంతో దేశ చరిత్రలోనే తొలిసారిగా 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల పోస్టులను సాధించామన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బిల్లులకు త్వరలోనే మోక్షం లభిస్తుందని చైర్మన్ వి. లచ్చిరెడ్డి తెలిపారు. 61 సంవత్సరాలు పైబడిన వీఆర్‌ఏలను సర్దుబాటు చేసి ఆ కుటుంబాలకు న్యాయం చేసేలా, కారుణ్య నియామకాలను చేపట్టేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రామకృష్ణ, టీజీఆర్‌ఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు బాణాల రాంరెడ్డి తదితరులు ప్రసంగించారు. జేఏసీ ఉద్యమ ఫలితంగా ఉద్యోగుల ఆంక్షలను, 317 జీవోలోని నిబంధనలను ప్రభుత్వం సడలించిందన్నారు. ముఖ్యంగా స్పౌజ్, మెడికల్, తదితర కోణాలలో ఉద్యోగుల బదిలీలకు అవకాశం కల్పించిందన్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో ఉద్యోగ సంఘాల నేతలు, సభ్యులు పాల్గొన్నారు.



రెవెన్యూ ఉద్యోగుల సమ్మేళనంలో మాట్లాడుతున్న ఉద్యోగ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి

పచ్చగుట్టకు కల్యాణశోభ

వెల్దుర్తి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అందుగులపల్లి గ్రామ శివారు అటవీ ప్రాంతంలో ఉన్న పచ్చగుట్ట శ్రీ సీతారాముని కల్యాణోత్సవానికి ముస్తాబైంది. గ్రామం నుంచి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో అటవీ ప్రాంతంలో ఉన్న ఈ గుట్టపై సీతా, లక్ష్మణ, ఆంజనేయ సమేతుడైన రామచంద్రుడు స్వయంభూగా వెలిశారు.

సీతారాములు నడయాడిన గుట్ట

సీతాదేవిని రావణాసురుడు అపహరించుకొని వెళ్లిన తరువాత సీతను వెతుక్కుంటూ ఈ పచ్చగుట్ట ప్రాంతలో శ్రీరాముడు తిరుగాడడంతోపాటు సేద తీరాడిన చరిత్ర ఆనవాళ్లు ఉన్నట్లు ఆలయ పూజరి ప్రతాప నారాయణశర్మ తెలిపారు. రావణ సంహారం చేసి సీతా, లక్ష్మణ, ఆంజనేయ సమేతుడైన రామచంద్రుడు ఈ పచ్చగుట్టపై కొద్ది రోజులు నివాసం ఉన్నాడని, ఈ క్రమంలోననే సకల చరాచర సృష్టికి మూలమైన ఆ పరమేశ్వరుడి విగ్రహాన్ని గృహలో ఏర్పాటు చేసి ఆరాధించడాని ప్రజల విశ్వాసం. ధ్యానముద్రలో ఉన్న పరమేశ్వరుని విగ్రహం సైతం గుట్టపై ఉన్న గృహలో ఉండడం దీనికి బలం చేకూర్చుతుంది. సీతాదేవి కోరికపై లోక సంరక్షణ కోసం ఈ పచ్చగుట్టపై సీతా, లక్ష్మణ, ఆంజనేయ సమేతుడైన రామచంద్రుడు వెలిశాడని ఇక్కడి ప్రజల నమ్మకం. ఈ గుట్ట వద్ద 25 ఏళ్ల నుంచి గ్రామస్థుల ఆధ్వర్యంలో సీతారామచంద్రుల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తారు.



కనీస సౌకర్యాలు కరువు

రాముని కల్యాణాన్ని వీక్షించి దర్శించుకోవడానికి పచ్చగుట్టకు గ్రామం నుంచి నడవడానికి కనీసం దారి కూడా లేదు. శ్రీరామనవమి సందర్భంగా జరిగే ఉత్సవాల కోసం గ్రామస్థులు ప్రతియేడు తాత్కాలికంగా మట్టిని చదును చేసి రోడ్డును ఏర్పాటు చేస్తారు. గుట్టపైకి సైతం వెళ్లడానికి వీలు లేకుండా దారి రాళ్లరప్పలతో కుడి ఉంది. గుట్టపై మండపం నిర్మాణానికి పనులు ప్రారంభించి పిల్లర్ల స్థాయిలోనే వదిలేశారు. ప్రతి సంవత్సరం శ్రీరామనవమికి తాత్కాలిక ఏర్పాట్లు చేసి కల్యాణాన్ని నిర్వహిస్తారు. ప్రభుత్వం స్పందించి అందుగులపల్లి గ్రామం నుంచి వెల్దుర్తి, పోతన్‌శెట్టిపల్లి రోడ్డును కలుపుతూ శాశ్వత రోడ్డు నిర్మాణాలు చేపట్టి ఆలయ అభివృద్ధికి సహకరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


డా. బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ తదితరులు

సామాజిక న్యాయం కోసం బాబు జగ్జీవన్‌రామ్ కృషి

● మంత్రి దామోదర్ రాజనర్సింహ

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): సమానత్వం, సామాజిక న్యాయం అందించేందుకు బాబు జగ్జీవన్‌రామ్ ఎనలేని కృషి చేశారని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. డా. బాబు జగ్జీవన్ రామ్ 117వ జయంతి సందర్భంగా శనివారం సంగారెడ్డిలో డా. బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి కలెక్టర్ క్రాంతి, ఎస్పీ పరితోష్ పంకజ్‌లతో కలిసి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బాబు జగ్జీవన్‌రామ్ స్వతంత్ర స్వతంత్ర సమరయోధుడిగానే కాకుండా స్వాతంత్రానంతరం భారత నిర్మాణంలో అపూర్వమైన సేవలందించిన మహనీయుడని కొనియాడారు. బాబు జగ్జీవన్‌రామ్ సూచించిన మార్గంలోనే సీఎం రేవంత్ రెడ్డి అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి జగదీష్, సాంఘిక సంక్షేమాధికారి అఖిలేష్ రెడ్డి, ఎస్సీ అభివృద్ధి కులాల అభివృద్ధి అధికారి రామాచారి, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, వివిధ ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గీతంలో ఎస్-2025 అవార్డుల ప్రదానం

పటాన్‌చెరు రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ లైఫ్ ప్రతిష్టాత్మక ఎస్-2025 అవార్డుల ప్రదానోత్సవం శనివారం జరిగింది. పలు విభాగాలలో అసాధారణ ప్రతిభ చూపిన విద్యార్థులను యాజమాన్యం సత్కరించింది. మొత్తం 52 అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్‌ఆర్ వర్మ, డైరెక్టర్ అంబికా ఫిలిప్ తదితరులు పాల్గొన్నారు.

జూన్‌లో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం

నంగునూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వచ్చే జూన్‌కల్లా నర్మెట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభమవుతుందని తెలంగాణ ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి తెలిపారు. శనివారం ఆయిల్ ఫెడ్ పరిధిలోని ములుగు, ఎల్లయగూడ, రంగనాయకసాగర్ ఆయిల్‌ఫాం నర్సరీలను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్మెటలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభమైతే జనగామ, సిద్దిపేట జిల్లా రైతులకు ప్రయోజనకారిగా ఉంటుందన్నారు. జిల్లాలలో 30వేల ఎకరాల ఆయిల్‌పామ్ సాగుకు రైతుల ముందుకు వచ్చారని తెలిపారు. పామాయిల్ ఫ్యాక్టరీ పనులను పరిశీలించి, పెండింగ్ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయిల్‌ఫెడ్ అధికారులు జనరల్ మేనేజర్ సుధాకర్ రెడ్డి, డిప్యూటీ మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి ఉన్నారు.

కళామతల్లి.. గొల్లపల్లి

● 60 ఏళ్లుగా సామూహిక గీతాపారాయణం
● పండుగలొస్తే యువత కోలాటం స్పెషల్
● భాగవతం ఆటలతో ప్రశంసలు

కొండాపూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా.. రీల్స్.. ఆన్‌లైన్ గేమ్స్.. ఇది ఇప్పటి యూత్ ట్రెండ్. ఏ మాత్రం ఖాళీ దొరికినా వీటికే పరిమితం అవుతారు. ఆకలిదప్పులు మర్చిపోయి గంటల తరబడి ఆన్‌లైన్‌లో ఉంటారు. స్నేహాలూ.. ఆటలూ అన్ని ఆన్‌లైన్‌లోనే. ఆ గ్రామ యువత మాత్రం సమ్‌థింగ్ స్పెషల్. గ్రామీణ సంస్కృతిని, కళలను కాపాడుకునేందుకు.. వాటికి జీవం పోసేందుకు కంకణం కట్టుకున్నారు. వారికి పెద్దలు కూడా సహకరిస్తుండటంతో సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం గొల్లపల్లిలో ఇప్పటికీ పాతతరం కళలు సజీవంగా నిలుస్తున్నాయి.

చిందేస్తే చూడాల్సిందే..

గొల్లపల్లి గ్రామంలో 1965లో మొదటిసారి సామూహిక భగవద్గీత పారాయణం ప్రారంభమైంది. అప్పటి నుంచి గ్రామంలోని హనుమాన్ మందిరం, ధర్మశాల వద్ద ఉదయం, సాయంత్రం వేళల్లో చిన్నారుల నుంచి మొదలుకొని పెద్దల వరకు మహిళలు, పురుషులు నిత్యం సామూహిక భగవద్గీత పారాయణం చేస్తున్నారు. ఇందులో గ్రామానికి యువత కీలక పాత్ర పోషిస్తోంది. ఇక పండుగలు, వినాయక, దేవీనవరాత్రులు, సీతారాముల కల్యాణం, గురు మాణిక్ ప్రభు వేడుక ఇలా కార్యక్రమం ఏదైనా గ్రామానికి చెందిన యువత కోలాటం ఉండాల్సిందే. అప్పటి నుంచి వివిధ కార్యక్రమాల్లో మార్కండేయ విలాసం, శశిరేఖ పరిణ యం, శ్రీరామ పాదుకల పట్టాభిషేకం, త్రిపుర సంహా రం, పుష్పలీల స్వయంవరం, లవకుశుల కల్యాణం, బ్రహ్మంగారి చరిత్ర, వేంకటేశ్వర మహత్యం, శివలీలలు, రామాయణం, అశ్వమేధయాగం, ఎల్లమ్మ, బీరప్ప, నల్లపోచమ్మ, పెద్దరాజు పెద్దమ్మ, గౌడ పురాణం, నాగార్జున చరిత్ర వంటి భాగవతం వంటి ఆటలు ప్రదర్శిస్తున్నారు. తిరుపతిలో గ్రామ బృందం చేసిన సామూహిక భజన ప్రశంసలు పొందింది. అలాగే, రాకమచర్ల, సంగారెడ్డి వైకుంఠాపురం, ఎమ్మెన్నార్ కళాశాలలో, వివిధ వినాయక, దేవీ నవరాత్రుల మండపాల వద్ద భజనలు, కోలాటాలను ప్రదర్శించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రధాన పాత్రలు పోషించడంతో పాటు ప్రదర్శనలకు అవసరమైన సంగీతాన్ని వారే సమకూరుస్తారు.


శివుడు పార్వతీ, బ్రహ్మదేవుడు, వివిధ వేషధారణలో యువకులు


నల్లపోచమ్మ భాగవతం ప్రదర్శనలో విష్ణుమూర్తి వేషంలో ఉన్న పరంధామను సన్మానిస్తున్న గ్రామస్థులు


అయోధ్యలో శ్రీరాముని ఆలయ ప్రారంభానికి గ్రామంలో అక్షింతల వితరణలో యువకులు(ఫైల్)




హార్మోనియం నేర్చుకుంటున్న యువకుడు

గీతాపారాయణంతో ఉల్లాసం



నారాయణరెడ్డితో కలిసి 1965లో సామూహిక, నిరంత భగవద్గీత పారాయణం మొదలు పెట్టాం. అప్పటి నుంచి ఇప్పటి వరకు నిరంతరం ఉదయం, సాయంత్రం చిన్నా.. పెద్ద అనే తేడా లేకుండా అందరం భగవద్గీత పారాయణం చేస్తున్నాం.

- అంజిరెడ్డి, నిరంతర పారాయణం వ్యవస్థాపకులు

యువతకు నేర్పుతున్నా..



మా పెద్దలు మాకు అందించిన కళలను కొనసాగిస్తున్నాం. నేను 12 ఏళ్ల కుర్రాడిగా ఉన్నప్పుడు భాగవతం, భజన, కోలాటం ఆడటం నేర్చుకున్నా. అప్పటి నుంచి నేను ప్రదర్శించడంతో పాటు గ్రామంలోని యువతకు నేర్పుతున్నా.

-బంటు నర్సింలు, గురువు

యువత నేర్చుకుంటున్నారు..



నేను చిన్నప్పటి నుంచి భజన మండలి సభ్యుడి గా ఉన్నా. ఎక్కడ భజన, సంస్కృతిక కార్యక్రమం జరిగినా వెళ్తుంటా. గ్రామానికి చెందిన యువత వాయిద్యాన్ని నేర్చుకునేందుకు వస్తున్నారు.

- ఎం. అంజిరెడ్డి, వాయిద్యకారుడు

పొద్దుతిరుగుడు కొనుగోళ్లకు బ్రేక్

- టార్గెట్ పూర్తయిందని నిలిపేసిన వైనం
- చిన్నకోడూరు కొనుగోలు కేంద్రంలో 10 రోజులుగా రైతుల పడిగాపులు
- అకాల వర్షాల నేపథ్యంలో ఆందోళన

చిన్నకోడూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పొద్దు తిరుగుడు పంటను సాగు చేసిన రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. చేతికి వచ్చిన పంటను అమ్ముకునేందుకు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఓ వైపు కేంద్రప్రభుత్వ కొనుగోలు టార్గెట్ పూర్తయిందని కొనుగోలు కేంద్రంలో పంట కొనుగోళ్లు నిలిపి వేయడం, మరో వైపు ఇటీవల ఆకాశంలో మబ్బులు కమ్ముకొని తేలికపాటి చిరు జల్లులు కురియడంతో రైతులకు కంటి మీద కునుకులేకుండా పోయింది.

పది రోజులుగా ఎదురుచూపులు

చిన్నకోడూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో గత నెల (మార్చి) 10న పొద్దు తిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో పొద్దు తిరుగుడు పంటను సాగు చేసిన రైతులు పంటను కోసి పొద్దుతిరుగుడు గింజలను కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చారు. ఇప్పటి వరకు సుమారు 3,500 క్వింటాళ్ల పొద్దు తిరుగుడు గింజలను కొనుగోలు చేశారు. కాగా కేంద్ర ప్రభుత్వ కొనుగోలు టార్గెట్ పూర్తయిందని సుమారు 10రోజులుగా పంట కొనుగోళ్లు నిలిపివేశారు.



కొనుగోలు కేంద్రంలో ఆరబెట్టిన పొద్దు తిరుగుడు గింజలు

ఆందోళన చెందుతున్న అన్నదాతలు

చిన్నకోడూరు మండల వ్యాప్తంగా యాసంగిలో 19,00 ఎకరాల్లో రైతులు పొద్దు తిరుగుడు పంటను సాగు చేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. పంట కొనుగోళ్లు నిలిపి వేయడం, ఇటీవల ఆకాశంలో మబ్బులు కమ్ముకొని చిరు జల్లులు పడటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు ఎక్కువగా పడితే పొద్దు తిరుగుడు గింజలు ఎక్కడ తడిసిపోతాయోనని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కొనుగోలు కేంద్రం వద్ద పడి గాపులు కాయాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి పూర్తి స్థాయిలో పొద్దు తిరుగుడు పంటను కొనుగోలు చేయాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

కేంద్ర ప్రభుత్వం టార్గెట్ పూర్తయ్యింది

కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన కొనుగోలు టార్గెట్ పూర్తయింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదు. అందువల్లే కొనుగోళ్లను నిలిపివేశాం. అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని సంబంధిత అధికారులకు విన్నవించాం. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది.

-సదానందం,ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ (అల్లీపూర్)

మొత్తం పంటను కొనుగోలు చేయాలి



కొనుగోలు కేంద్రంలో సుమారు పది రోజులుగా పంట కొనుగోళ్లు నిలిపి వేశారు. మూడు రోజుల క్రితం చిరుజల్లులు పడ్డాయి. అకాల వర్షాల నేపథ్యంలో పంట తడిసి నష్టపోయే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రతిరోజూ కొనుగోలు కేంద్రం వద్ద పడిగాపులు తప్పడం లేదు. ప్రభుత్వం మొత్తం పొద్దు తిరుగుడు పంటను కొనుగోలు చేయాలి.

- రెడ్డి మహేందర్ రెడ్డి, రైతు, చిన్నకోడూరు

భద్రాచలానికి స్పెషల్ బస్సు

హుస్నాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి సందర్భంగా భద్రాద్రి శ్రీరామ కల్యాణాన్ని వీక్షించడానికి ఆదివారం ఉదయం 5 గంటలకు హుస్నాబాద్ నుంచి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ వెంకన్న తెలిపారు. ఈ అవకాశాన్ని హుస్నాబాద్ పరిసర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైకల్యాన్ని జయించి..



శారద

కొండపాక, ఏప్రిల్ 5 (ఆంధ్ర జ్యోతి): పట్టుదల, సాధించాలని తపన ఉంటే ఎన్నికష్టాలు ఎదురైనా లక్ష్యాన్ని సాధించవచ్చని మండలంలోని అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తోట శారద అనే యువతి నిరూపించింది. అంగవైకల్యం ఉన్నప్పటికీ ఏమాత్రం కుంగుబాటుకు లోనుకాకుండా, ప్రణాళికాబద్ధంగా కష్టపడి చదివి పీహెచ్‌డీ సాధించింది. ఆమె కాకతీయ యూనివర్సిటీలో అయిత చంద్రయ్య సాహిత్యం సమగ్ర పరిశీలన అనే అంశంపై పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ పట్టా పొందింది.

ఆలయానికి గ్రానైట్ అందజేత

చిన్నకోడూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలం విఠలాపూర్ గ్రామంలోని పెద్దమ్మతల్లి ఆలయానికి మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విరాళం అందించారు. ఆలయ కమిటీ సభ్యులు, పార్టీ నాయకుల కోరిక మేరకు శనివారం హరీశ్‌రావు రూ. లక్ష విలువ గల గ్రానైట్‌ను పార్టీ నాయకులతో పంపించగా వారు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

దళిత బంధు నిధులు విడుదల చేయాలి

బెజ్జంకి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రెండో విడత దళితబంధు పథకంలో ఎంపికైన లబ్ధిదారుల ఖాతాల్లో వెంటనే నిధులు జమ చేయాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శనివారం బెజ్జంకి అంబేడ్కర్ కూడలిలో నిరసన తెలిపి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో రెండో విడత దళితబంధు పథకానికి అర్హులైన లబ్ధిదారుల ఖాతాల్లో రూ.3 లక్షలు జమ చేశారన్నారు. ఎన్నికల నేపథ్యంలో లబ్ధిదారుల ఖాతాలను ఫ్రీజ్ చేసి కలెక్టర్ ఖాతాలోకి మళ్లించారని గుర్తు చేశారు. ఎన్నికలు ముగిసినా నేటి వరకు లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమకాలేదన్నారు. కార్యక్రమంలో బాల్‌నర్సు, దేవదాస్, లక్ష్మణ్, బాబు, సుదర్శన్, రాజేశం, పర్శరాములు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గాంధీ,అంబేడ్కర్ సిద్ధాంతాలే దేశానికి పునాది

- గ్రామాల్లో కాంగ్రెస్ సంవిధాన్ పాదయాత్ర



చేర్యాల: ఆకునూరులో ర్యాలీలో జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, నాయకులు



జక్కాపూర్‌లో పాదయాత్రలో పూజల హరికృష్ణ

సిద్దిపేటరూరల్/చేర్యాల/చిన్నకోడూరు/కోహెడ/అక్కన్నపేట/ నంగునూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సిద్ధాంతాలే మన దేశానికి పునాదులని కాంగ్రెస్‌పార్టీ నాయకులు పేర్కొన్నారు. శనివారం జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర నిర్వహించాయి. ఈ మేరకు నారాయణరావుపేట మండలంలోని పలు గ్రామాల్లో సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగం ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా అంబేడ్కర్‌పై చేసిన వాఖ్యలే ఇందుకు నిదర్శనమన్నారు. దేశంలో బీజేపీకి పరిపాలన చేతకాక ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల రాజ్‌వీర్, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు. చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలో జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కొమ్మూరి మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని అవమానపరుస్తూ దేశప్రజల స్వేచ్ఛకు భంగం కలిగిస్తున్న బీజేపీకి ప్రజలు బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. పాదయాత్రలో పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త లకావత్ ధన్వంతి , మండలాధ్యక్షుడు కొమ్ము రవి, పీఏసీఎస్ చైర్మన్ మేరుగు కృష్ణ, తదితర నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా చిన్నకోడూరు మండలంలోని గోనెపల్లి, ఓబులాపూర్ గ్రామాల్లో, కోహెడ మండలంలోని కాచాపూర్, షైసంపల్లి, సముద్రాల గ్రామాల్లో, అక్కన్నపేట మండలంలోని రామవరంలో, నంగునూరు మండలంలోని తిమ్మాయిపల్లి, బాషాయిగూడెం, కోనయిపల్లి, వెంకటాపూర్ గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు పాదయాత్రలో భాగంగా ర్యాలీలు నిర్వహించి, రాజ్యాంగ పత్రాలను పంపిణీ చేసి, ప్రతిజ్ఞ నిర్వహించారు.

మంత్రి పొన్నంను కలిసిన నాయకులు



మంత్రి పొన్నం ప్రభాకర్‌తో వర్గల్ మండల నాయకులు

వర్గల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మినిస్టర్ క్వార్టర్స్‌లో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను శనివారం వర్గల్ మండల కాంగ్రెస్ నాయకులు నరేందర్‌రెడ్డి, అనిల్‌రెడ్డితో పాటు పలువురు కలిశారు. నియోజకవర్గ పరిస్థితులు, అభివృద్ధి పనులపై మంత్రికి వివరించారు. అదేవిధంగా వర్గల్ మండలంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని వారు మంత్రిని కోరినట్లు తెలిపారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

చేర్యాల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వెట్టిచాకిరీకి గురవుతున్న ఉపాధిహామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొంగరి వెంకట్‌మావో పేర్కొన్నారు. మండలంలోని చిట్యాల గ్రామంలో శనివారం ఉపాధిహామీ పనుల ప్రదేశాన్ని సందర్శించి కూలీలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పనిచేసిన కూలీలకు15 రోజుల్లో డబ్బులు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, కనీస వసతులు లేక నానాతం టాలుపడుతున్నారన్నారు. కూలీని రూ.600కు పెంచాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు గొర్రె శ్రీనివాస్, మల్కని ఎల్లయ్య, మేక భాగ్యలక్ష్మి, స్వప్న, లక్ష్మి, రజిత, కిష్టయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలానికి గోటి తలంబ్రాలను అందించిన ఘనత గజ్వేల్‌దే



గజ్వేల్‌లో భద్రాచల సీతారాముల కల్యాణోత్సవ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం సీతారాముల కల్యాణానికి గోటి తలంబ్రాలను అందించిన ఘనత గజ్వేల్‌దేనని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ పరిధిలోని త్రిశక్తి ఆలయంలో సీతారాముల కల్యాణానికి చెందిన కరపత్రాలు, గోడ పత్రికలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భద్రాచల దేవస్థానానికి 250 కిలోల గోటి తలంబ్రాలు అందించడం గజ్వేల్‌కే గర్వకారణం అన్నారు. ఆయన వెంట సామాజిక సమరసత వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల నరేశ్‌బాబు, మునిసిపల్ మాజీ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, మాజీ కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య, మర్కంటి కనకయ్య, సాయి, ఎల్లేశ్, ఏల వెంకటేశ్ తదితరులున్నారు.

శ్రీరామ నవమికి ఆలయాలు ముస్తాబు





హుస్నాబాద్‌లో ముస్తాబైన సీతారామచంద్రస్వామి ఆలయం, కోహెడ సీతా రామచంద్రస్వామి ఆలయంలో ఉత్సవమూర్తులు

హుస్నాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలోని రామవరం రోడ్డులో ఉన్న శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయం ఆదివారం జరిగే శ్రీ రామనవమి వేడుకలకు ముస్తాబైంది. ఉదయం 11గంటలకు కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.

● కోహెడ: కోహెడ సీతారామచంద్రస్వామి దేవస్థానం (హరిహర క్షేత్రం)లో ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు వార్షిక పంచాహ్నిక ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 6న ఆదివారం గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవాచనం, దేవతా ప్రతిష్ఠ, ధ్వజారోహణం, శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం ఉంటుందనిఅర్చకులు, వైదిక నిర్వహకులు బ్రహ్మశ్రీ కోహెడ ప్రసాద రావు శర్మ తెలిపారు. 10వ తేదీన శ్రీ సీతారామ చంద్రస్వామి రథోత్సవం జరుగుతుంది. స్వామి వారి ఏకాంత సేవ కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయి.

● దుబ్బాక/ మిరుదొడ్డి: దుబ్బాక, మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో హనుమాన్ దేవాలయాల్లో ఆదివారం నిర్వహించే సీతారాముల కల్యాణమహోత్సవానికి ఆలయాలు ముస్తాబయ్యాయి. దుబ్బాకలోని వీరాంజనేయస్వామి దేవాలయ ఆధ్వర్యంలో శనివారం సీతారాముల స్వామి ఎదుర్కోళ్ల ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

బెజ్జంకి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను శనివారం మానకొండూర్ నియోజకవర్గంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు అందజేసి, బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జెల్ల ప్రభాకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మండలాధ్యక్షుడు రత్నాకర్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు ఉన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మానకొండూరు ఎమ్మెల్యే

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చేర్యాల/వర్గల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : జనగామ జిల్లా ఆర్టీఏ మెంబర్ కొమ్ము నర్సింగరావు శనివారం పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. చేర్యాలకు చెందిన ఎండీ ఖాజాపాషాకు రూ.60వేలు. యాంసాని అన సూర్యకు రూ.42,500, అయేషా తస్నీన్‌కు రూ.60వేలు, పెద్దరాజుపేట అంకని అజయ్‌కుమార్‌కు రూ.60వేలు , వీరన్నపేట పొన్నబోయిన కవితకు రూ.25వేలు, చొప్పున మంజూరైన చెక్కులను శనివారం చేర్యాలలో అందజేశారు. అదేవిధంగా వర్గల్ మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన నాగరాజుకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును మండల సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నరేందర్‌రెడ్డి అందజేశారు.

సామాజిక న్యాయం కోసం.. పోరాడిన యోధుడు జగ్జీవన్‌రామ్



గజ్వేల్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, కాంగ్రెస్ నాయకులు



కోహెడ : అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

న్యూస్‌నెట్‌వర్క్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతిని పురస్కరించుకుని శనివారం జిల్లావ్యాప్తంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణాలు, గ్రామాల కూడళ్లు, కార్యాలయాల్లో ఆయా శాఖల అధికారులు, సంఘాలు, వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు జగ్జీవన్ రామ్ చిత్రపటాలు, విగ్రహాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సామాజిక న్యాయం, సమానత్వం కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు బాబు జగ్జీవన్ రామ్ అని కొనియాడారు. దళితుల అభ్యున్నతి కోసం అహర్నిషలు కృషిచేసిన డాక్టర్ బాబుజగ్జీవన్‌రామ్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.



సిద్దిపేటలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్



దుబ్బాకలో బాబుజగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తదితరులు

తండ్రి మందలిస్తాడనే భయంతో కొడుకు ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రూరల్ ఎస్ఐ అపూర్వరెడ్డి

సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): స్నేహితులతో కలిసి చేసిన దొంగతనం విషయం తండ్రికి తెలిస్తే మందలిస్తాడనే భయంతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం సిద్దిపేట రూరల్ మండలంలోని పుల్లూరులో శనివారం చోటు చేసుకున్నది. సిద్దిపేట రూరల్ ఎస్ఐ గుడ అపూర్వరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పుల్లూరు గ్రామానికి చెందిన కర్రె సంజీవ్ (18) మధ్యాహ్నం తండ్రితో కలిసి భోజనం చేశాడు. అనంతరం గదిలో పడుకుంటానని చెప్పి తలుపు పెట్టుకున్నాడు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వచ్చి తన కొడుకు గురించి అడగడంతో తండ్రి బాలయ్య ఇంటిలోకి వెళ్లి గది తలుపు తీసి చూడగా స్లాబ్‌కు ఉరేసుకుని వేలాడుతున్న సంజీవ్ మృతదేహం కనిపించింది. వారం రోజుల క్రితం తన స్నేహితులతో కలిసి చేసిన దొంగతనం విషయం వెలుగులోకి రావడంతో తండ్రి మందలిస్తాడనే భయంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబీకులు తెలిపారు. ఘటనపై మృతుడి తండ్రి బాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డివైడర్‌ను ఢీకొన్న బైక్.. ఒకరి మృతి

గజ్వేల్ రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బైక్ డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. ఈ ప్రమాదం గజ్వేల్ ఔటర్‌రింగ్‌రోడ్డుపై శనివారం చోటుచేసుకున్నది. గజ్వేల్ ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మహబూబాబాద్ జిల్లా నర్సింలుపేట మండలం దంతడ్‌పల్లి గ్రామానికి చెందిన ఎలుక గోపిరెడ్డి(75) జగదేవ్‌పూర్ మండలం చాట్లపల్లి గ్రామంలోని పౌల్ట్రీఫాంలో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. శనివారం తన మనవడు వేముల కార్తీక్‌రెడ్డితో కలసి ములుగు మండలం లక్ష్మక్కపల్లి గ్రామంలోని ఆర్వీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బంధువులను చూడడానికి బైకుపై బయలుదేరాడు. ఈ క్రమంలో ప్రజ్ఞాపూర్ గ్రామ శివారులోని ఔటర్‌రింగ్ రోడ్డు వద్ద జగదేవ్‌పూర్ వెళ్లే దారిలో ముందుగా వెళ్తున్న లారీని తప్పించబోయి పక్కనే ఉన్న డివైడర్‌ను బైక్ ఢీకొట్టడంతో బైక్‌పైన ఉన్న గోపిరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. మనవడు కార్తీక్‌రెడ్డి స్వల్పగాయాలతో బయటపడ్డాడు. తీవ్రగాయాలైన గోపిరెడ్డిని 108 అంబులెన్స్‌లో ప్రజ్ఞాపూర్‌లోని ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పట్టపగలు ఇంటి తాళం పగులగొట్టి చోరీ

రాయపోల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పట్టపగలే గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన మండలంలోని అనాజీపూర్ గ్రామంలో చోటుచేసుకున్నది. గ్రామస్థులు, ఎస్ఐ రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. అనాజీపూర్ గ్రామానికి చెందిన మత్తమల్ల నర్సింహులు శనివారం ఉదయం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లాడు. తిరిగి వచ్చి చూడగా ఇంటి తాళాలు ధ్వంసమై ఉన్నాయి. ఈ సమాచారమందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా, బీరువా తాళాలు పగులగొట్టి అందులో ఉన్న రూ. 50వేలు చోరీ చేసినట్లు గుర్తించారు. కాగా అదే సమయంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి అక్కడి నుంచి మూగవాడిగా నటిస్తూ వెళ్తుండగా స్థానికులు గమనించినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు క్లూస్‌టీంను రప్పించి, కేసు దర్యాప్తు చేపట్టారు.

గజ్వేల్‌లో యువకుడు అదృశ్యం

గజ్వేల్ రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): యువకుడు అదృశ్యం అయిన సంఘటన గజ్వేల్ పట్టణంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గజ్వేల్ పట్టణానికి చెందిన చాడ మల్లారెడ్డి(28)కి హైదరాబాద్‌లో తెలిసిన వాళ్ల డబ్బులు ఇచ్చేది ఉంది అని చెప్పి వెళ్లాడు. తిరిగి ఎంతకూ ఇంటికి రాకపోయేసరికి కుటుంబసభ్యులు బంధువుల వద్ద, వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ప్రజలంతా అంతా కలసి మెలసి ఉండాలి: ఏసీపీ



మాట్లాడుతున్న ఏసీపీ పురుషోత్తంరెడ్డి

గజ్వేల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలంతా కలసి మెలసి ఉండాలని గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి అన్నారు. శ్రీరామనవమి, హనుమాన్ జయంతి పండుగల సందర్భంగా గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ సైదా, అడిషనల్ ఇన్‌స్పెక్టర్ ముత్యంరాజు ఆధ్వర్యంలో ఓ గార్డెన్స్‌లో పీస్ కమిటీ శాంతి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన గజ్వేల్ ఏసీపీ మాట్లాడుతూ పండుగల సందర్భంగా నిర్వహించే శోభాయాత్రలను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. సోషల్ మీడియాలో కుల, మతాలను రెచ్చగొట్టే విధంగా ఎవరైనా పోస్టులు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ నరసయ్య, విద్యుత్‌శాఖ ఏఈ మారుతి, వివిధ డిపార్ట్మెంట్ అధికారులు వివిధ మతాలకు చెందిన పెద్దలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అలీరాజ్‌పేట్‌లో మొక్కలు నాటిన హరితసేన



మొక్క నాటిన హరితసేన సభ్యులు

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్ గ్రీన్ ఛాలెంజ్‌లో భాగంగా గజ్వేల్ నియోజకవర్గ హరితసేన ఇన్‌చార్జి మొగిలి అనిల్‌రెడ్డి కుమారుడు వశిష్టరెడ్డి పుట్టినరోజు సందర్భంగా జగ మండలంలోని అలీరాజ్‌పేట్ గ్రామంలో మొక్కలు నాటారు. హరితసేన జిల్లా అధ్యక్షుడు చెప్యాల రాజేశ్వర్‌రావు బాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి ప్రతి ఒక్కరు రేపటి తరాల కోసం మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బాలకిషన్, కర్రే తిరుపతి, శ్రీనివాస్‌రెడ్డి, బాపురెడ్డి, ఎర్రవల్లి శేఖర్, పెద్దల కరుణాకర్‌రెడ్డి, ఏనుగుల సత్తిరెడ్డి, మొగిలి లోకేష్‌రెడ్డి, మొగిలి లక్ష్మి, భీమరి మహేష్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

మర్పడగ క్షేత్రంలో వైభవంగా ఆర్ద్ర మహోత్సవం



మర్పడగ క్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

కొండపాక, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్పడగ విజయదుర్గాసమేత సంతాన మల్లికార్జున క్షేత్రంలో శనివారం ఆర్ద్ర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. క్షేత్ర నిర్వాహకులు చెప్పెల హరనాథ్‌శర్మ పర్యవేక్షణలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, నీరాజనసేవ జరిగాయి. ఉదయం 10 గంటల నుంచి స్వస్తివాచనం, కలశ స్థాపన నవగ్రహ, దిక్పాలక స్థాపన, స్థాపితం దేవతాపూజా నిర్వహించారు. అనంతరం సంతాన పాశుపత అభిషేకం, సుబ్రహ్మణ్య స్వామికి విశేష పంచామృత ఫలరస అభిషేకం, సంతాన పాశుపత హవనం, పూర్ణాహుతి నిర్వహించారు. క్షేత్రానికి వచ్చిన భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో క్షేత్ర నిర్వహణా కమిటీ సభ్యులు, మర్యాల రవీందర్, తిరుపతి రెడ్డి,మల్లేశం, శ్రీశైలం, నరసింహారెడ్డి , రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.